సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం। 12। జనవరి। 2025



స్కాన్ చేసి అభిప్రాయం ..

ఫిర్యాదులపై పోలీసుల పనితీరును తెలుసుకునేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.

10లో



ముందస్తు సంకాంత్రి

పలు విద్యాలయాల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు, పతంగుల పోటీలు నిర్వహించారు.

11లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 16°

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా కూడారై ఉత్సవం

- భారీగా హాజరైన భక్తులు



కూడారై వేడుకను నిర్వహిస్తున్న వేద పండితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో శనివారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ధనుర్మాసోత్సవాల్లో 27వ రోజు ఈ వేడుకను నిర్వహిస్తారు. గోదాదేవి అమ్మవారికి శ్రీరంగనాథునితో వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసం నివేదన చేస్తానన్న మొక్కు తీర్చారని ప్రతీతి. స్వామివారితోపాటు గోదాదేవి అమ్మవారిని బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రవిడ ప్రబంధాలతోపాటు పాయసాన్ని సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబన్నకు ఘన నివాళి



వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు

కొత్తగూడెంరూరల్: కలెక్టరేట్‌లో శనివారం వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పాలెగాడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి చేసిన సాయుధ పోరులో సైనాధ్యక్షుడిగా ఓబన్న వీరోచిత పాత్రను పోషించాడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి రమాదేవి, బీసీ నాయకులు గుర్రం శ్రీనివాసరావు, ముద్దంగుల శేఖర్, ఒర్సు సైదులు, చల్లాశివ, పల్లపు వెంకటేశ్వర్లు, తెపల్ల దుర్గారావు, కొడుమూరి సత్యనారాయణ, కురిమెళ్ళ శంకర్, బీసీ సంక్షేమశాఖ అధికారి ఇ.ఇందిర పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పాల్వంచరూరల్: గురుకులాల్లో ఐదో తరగతిలో బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశాలకు వచ్చే నెల 1వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్ పోర్టు సైజ్ ఫొటో, జనన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మొబైల్ నంబర్ వివరాలు నమోదు చేయాలని, రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు. ఫిబ్రవరి 23న పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆయా గురుకులాల్లో 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు 'సింగరేణి' రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఖాళీగా ఉన్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ పరీక్ష జరుగుతుందని జీఎం కోడూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. గత ఏడాది మార్చిలో 17 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు.

గంగిరెద్దుల విన్యాసాలేవి..?





ఆధునిక కాలంలో క్రమంగా ఆచార సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. గతంలో సంక్రాంతి వస్తుందంటే ఊరూరా దూడూ బసవన్నలు సందడి చేసేవి. కానీ ప్రస్తుతం పండుగ సమీపించినా గంగిరెద్దులు అంతగా కన్పించడం లేదు. ఆదరణ లేక పోషణభారం కావడంతో నిర్వాహకులు గంగిరెద్దుల పెంపకం చేపట్టడంలేదు. బసవన్నలు లేకుండానే ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేస్తున్నారు.

– పాల్వంచరూరల్

సంక్రాంతి వచ్చినా సందడి చేయని బసవన్నలు

- పల్లెల్లోనూ క్రమంగా తగ్గిపోతున్న ఆదరణ
- పోషణభారంతో పెంపకం చేపట్టలేకపోతున్న నిర్వాహకులు

బసవన్నకు గ్రాసం కొరత

ఒకప్పుడు సంక్రాంతికి ముందు వేకువజామున చలిలో గంగిరెద్దులు ఇంటింటా తిరిగేవి. నిర్వాహకులు పల్లె పల్లె తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తుండేవారు. ప్రజలు ఇచ్చే కానుకలతో వారి కుటుంబాలు ఆరునెలల పాటు సంతోషంగా గడిపేవి. ఆ తర్వాత కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. క్రమంగా గంగిరెద్దులు కనుమరుగవుతున్నాయి. ఈ సంవత్సరం గంగిరెద్దుల సందడే కన్పించడం లేదు. బసవన్నలతో ఊరూరా తిరిగినా ఆదరణలేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. తమతోపాటు ఎద్దులకు కడుపు నిండటంలేదని, గ్రాసం కూడా సక్రమంగా లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరి సాగు చేసిన రైతులు వ్యవసాయ కూలీలతో పంటను కోయిస్తే ఎండుగడ్డి రైతుల వద్ద అందుబాటులో ఉండేది. ఇప్పుడు యంత్రాల ద్వారా వరి పంట కోస్తుండటంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో గంగిరెద్దులకు వరిగడ్డి దొరకడం కష్టంగా మారిందని చెప్పవచ్చు.

ఇళ్లు, రేషన్ కార్డులూ లేవు

గంగిరెద్దులను నమ్ముకుని సుమారు 50 కుటుంబాలు అనేక సంవత్సరాలుగా పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ మండలాల్లో జీవనం సాగిస్తున్నాయి. తరతరాలుగా గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఇప్పటికీ వ్యవసాయ భూములు, ఇళ్లు లేవు. సంక్రాంతి పండుగతోపాటు ఎవరైనా పెద్దవాళ్లు కాలం చేస్తే కర్మల రోజున గంగిరెద్దులతో నిర్వాహకులు విన్యాసాలు చేయిస్తున్నారు. దాతలు ఇచ్చే డబ్బులతో బతుకు వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆడిస్తేనే పూట గడుస్తుంది



తాత ముత్తాతల నుంచి ఆచారంగా గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సంక్రాంతి సందర్భంగా ఊరూరా తిరిగితే అంతో ఇంతో ఆదాయం వస్తుంది. మిగిలిన రోజుల్లో సాయంచేసేవారు ఉండరు. దీంతో పూట గడవడమే కష్టంగా మారింది.

–ఎర్ర వెంకన్న, సాటివారిగూడెం

ఫోన్ పే అంటున్నారు



గతంలో గంగిరెద్దులతో ఏ ఇంటికి వెళ్లినా అంతో ఇంతో నగదు ఇచ్చేవారు. ఇప్పుడు అందరూ నగదు లేదని, ఫోన్ పే చేస్తామంటున్నారు. కానీ మాకు అసలు ఫోన్లే లేవు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

–వీరన్న, రాజాపురం

పశుగ్రాసం కరువు



సంక్రాంతి పండుగకు గంగిరెద్దులను తీసుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్తే ఆరునెలలకు సరిపడా గ్రాసం దొరికేది. ఇప్పుడు ఆదరణ కరువైంది. ఎన్ని గ్రామాలు తిరిగినా ఎండుగడ్డి లభించడం లేదు. బసవన్నల పొట్ట నింపలేకపోతున్నాం.

–ఎ.వెంకన్న, ఎర్రగుంట

ఆధునిక హరిదాసు



జూలూరుపాడులో త్రిచక్ర వాహనంపై హరిదాసు

అశ్వారావుపేటరూరల్/జూలూరుపాడు: కాలంతోపాటు సంప్రదాయాలు కూడా మార్పులకు లోనవుతున్నాయి. సాధారణంగా హరిదాసు చేతిలో వీణ, తలపై అక్షయపాత్ర, నుదుట తిలకం, చేతిలో చిడతలు, పూలదండ, కాలి కి గజ్జెలు ఉంటాయి. కీర్తనలు పాడుకుంటూ కాలి నడకన ఇంటింటికి తిరుగుతుంటారు. ఇలా వచ్చే హరిదాసు గుమ్మంలోకి రాగానే తలపై ఉన్న అక్షయపాత్రలో బియ్యం వేస్తారు. కానీ ఇప్పుడు హరిదాసుల తీరు మారుతోంది. వయసు పైబడటం, ఆ తర్వాత తరంవారెవరూ వృత్తి చేపట్టకపోవడంతో త్రి, ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్నారు. చంద్రుగొండ మండలం రావికంపాడుకు చెందిన పూదూరి నర్సింహా దశాబ్దాలుగా హరిదాసుగా జీవనం సాగిస్తున్నాడు. గతంలో సైకిల్‌పై తిరిగిన ఆయన ప్రస్తుతం త్రిచక్రవాహనంపై తిరుగుతున్నాడు. ఇక అశ్వారావుపేటకు చెందిన బొమ్మకంటి సంతోష్ కుమార్ ద్విచక్ర వాహనంపై ఇంటింటికీ వెళ్తూ దాన ధర్మాలు స్వీకరిస్తున్నాడు. వీరిద్దరూ చూపరులను ఆకర్షిస్తున్నారు. వాహనానికే తంబూర, అక్షయపాత్రలను కట్టి ఉంచారు.



అశ్వారావుపేటలో ద్విచక్ర వాహనంపై..

కొండరెడ్ల అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మూడు హైలెవల్ వంతెనలకు శంకుస్థాపన
- కొండరెడ్ల క్షేత్రంలో ఆయిల్ పామ్ సాగు ప్రారంభం



పూసుకుంటలో హైలెవల్ వంతెనకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే తదితరులు

దమ్మపేట: కొండరెడ్లకు ఉపాధి కల్పన, వ్యవసాయ రంగంలో తోడ్పాటుతోపాటు వారి అభివృద్ధికి ఐటీడీఏ, ప్రభుత్వం తరపున కృషి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని పూసుకుంట, కటుకూరు గ్రామాల్లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రాచన్నగూడెం నుంచి కటుకూరు రోడ్డు మార్గంలో, ఆర్లపెంట గండి బీటీ రోడ్డు నుంచి పూసుకుంటకు వచ్చే మార్గంలో మూడు హైలెవల్ వంతెనలకు శంకుస్థాపన నిర్వహించారు. సుమారు రూ.4.18 కోట్ల వ్యయంతో వీటిని నిర్మించనున్నారు. పూసుకుంటలో కొండరెడ్ల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించారు. కొండరెడ్ల పిల్లలు, పెద్దలకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధే శాశ్వతమని పేర్కొన్నారు. కొండరెడ్డి గిరిజనులకు వ్యవసాయ బోర్లు, విద్యుత్ కనెక్షన్లు, ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. వారానికోసారి గ్రామంలో వైద్య సేవలందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే కృషి, ప్రభుత్వ సహకారంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ కొండరెడ్ల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వ్యక్తికి వ్యవసాయ, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం నుంచి చేయూతనందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, అధికారులు డేవిడ్ రాజు, నాగలక్ష్మి , విద్యాచందన, కిషోర్, కృష్ణ, వెంకటేశ్వర్లు, మధు, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఆయిల్ పామ్ అడ్వైజరీ కమిటీ మెంబరు అలపాటి రామచంద్ర ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోటగిరి సత్యంబాబు, రావు గంగాధరరావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, కేవీ, కొయ్యల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అంబసత్రంలో రాపత్తు సేవ



అంబసత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా శనివారం రామయ్య స్వామికి అంబసత్రంలో రాపత్తు సేవలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, శ్రీరామనామస్మరణల నడుమ పల్లకీ సేవగా పురవీధుల్లో అంబసత్రానికి తీసుకొచ్చారు. వేద పండితులు, అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీకి ముక్కోటి ఆదాయం రూ. 7 లక్షలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోకు ముక్కోటి పండుగ కలిసొచ్చింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడపగా రూ. 7 లక్షల ఆదాయం లభించింది. ఈ మేరకు డీఎం తిరుపతి శనివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 8,9,10 తేదీల్లో సుమారు 110 బస్సు సర్వీసులు తిప్పారు. దీంతో రూ.7 లక్షల ఆదాయం సమకూరింది. మొత్తం మూడు రోజుల్లో 88 వేల మంది ప్రయాణికులు ప్రయాణించగా, వారిలో మహిళా ప్రయాణికులు(మహాలక్ష్మి పథకం లబ్ధిదారులు) 50 శాతం ఉన్నారని డీఎం తెలిపారు.

రెచ్చిపోతున్న స్ట్రీట్ ఫైటర్స్

- చిన్న కారణాలకే గొడవలు పడుతున్న యువత
- విచక్షణారహితంగా భౌతిక దాడులు, గొడవలు
- కనిపించని కౌన్సెలింగ్‌లు, నైపుణ్య శిక్షణ శిబిరాలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉద్యోగాల వేటలో బిజీగా ఉండాల్సిన యువకులు రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నారు. చిన్నచిన్న కారణాలకే గొడవలకు దిగుతూ కండబలం చూపించుకుంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఇతర పట్టణాల్లోనూ రాత్రయితే జగడాలకు దిగుతున్నారు.

ఇటీవల కొన్ని ఘటనలను పరిశీలిస్తే..

- ఇటీవల భద్రాచలం నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓ వ్యక్తి పాల్వంచలో ఆటోలో చేజ్ చేశాడు. దమ్మపేట సెంటర్ దగ్గర బస్సు ఆగిన వెంటనే సీట్లు లేవంటూ డ్రైవర్ బదులిచ్చాడు. సీట్లు లేకుంటే బస్సు ఎందుకు ఆపావంటూ ఆ బస్సుకు అడ్డుగా ఆటోను ఆపి పది నిమిషాలకు పైగా రభస సృష్టించాడు
- అతిగా మద్యం తాగిన వ్యక్తిని బస్సులోకి ఎక్కించుకునేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన మద్యం మత్తులో ఉన్న సదరు ప్రయాణికుడు, అతని స్నేహితులు ట్రావెల్ ఏజెంట్‌పై దాడి చేశారు. గాయాలతో బాధపడుతున్నా కనికరం లేకుండా కొట్టారు. ఈ ఘటనను వీడియో తీస్తున్న వ్యక్తులకు సైతం బెదిరింపులు ఎదురయ్యాయి.
- వారం రోజుల కిందట కొత్తగూడెం చిన్నబజార్ సెంటర్‌లో రాత్రి పదిగంటల తర్వాత షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లేందుకు ఓ వర్కర్ తన బైక్ మీద కూర్చున్న యువకులను జరగమని కోరాడు. అంతే తమనే జరగమంటావా అంటూ సదరు గ్యాంగ్ దాడికి దిగింది
- మరో ఘటనలో మా ఏరియాలో మీ ఏరియా వాళ్ల పెత్తనం ఏంటంటూ ఓల్డ్ డిపో సెంటర్‌లో రెండు గ్యాంగ్‌లు పరస్పరం విడిపోయి దాడులు చేసుకున్నాయి. రోడ్ల వెంట పరుగులు పెడుతూ దాడులు చేసుకుంటూ ఓల్డ్ డిపో నుంచి హిందూ శ్మశాన వాటిక వరకు అరగంటకు పైగా వీరంగం సృష్టించారు.
- నాలుగైదు రోజుల కిందట కొత్తగూడెం బస్టాండ్, రైల్వే స్టేషన్ మధ్య ఉన్న కాలిబాట మార్గంలో రెండు గ్రూపులుగా యువకులు కేకలు పెడుతూ రక్తాలు కారేలా కొట్టుకున్నారు. కింద అండర్ బ్రిడ్జిలో వెళ్తున్న వారు పైన ఏం జరుగుతుందో తెలియక కంగారు పడ్డారు.
- విద్యానగర్‌లో శుక్రవారం రాత్రి ఓ నూడుల్స్ సెంటర్ దగ్గర యువకులు గొడవ పడ్డారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ట్రాఫిక్ హడావుడిని లెక్కచేయకుండా రోడ్డు మీదే కండబలం ప్రదర్శించారు.

అందరూ యువకులే

జిల్లాలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో యువతలో కొందరు గ్యాంగుల పేరిట తిరుగుతూ చిన్నచిన్న కారణాలకే గొడవలకు దిగుతున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు వంటి పట్టణ ప్రాంతాల్లో స్ట్రీట్ ఫైట్స్ పెరిగిపోతున్నాయి. ఇలాంటి గొడవల్లో పాల్గొంటున్న వారిలో నూటికి తొంభైశాతం మంది పాతికేళ్లలోపు యువకులే ఉంటున్నారు. ఈ తరహా గొడవలు జరిగినప్పుడు అక్కడికి చేరుకుంటున్న పోలీసులు సైతం 'యువతపై కేసులు పెడితే వారి భవిష్యత్తుకు ఇబ్బంది' అనే కన్సర్న్‌తో మంచి మాటలతో హెచ్చరించి వదిలిపెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఖద్దరు పెత్తనం సైతం గ్యాంగ్‌వార్‌కు రక్షణ కవచంగా ఉపయోగపడుతోంది. కాగా గల్లీల్లో గొడవలు పడే వారిని కేవలం మంచి మాటలతో వదిలేయకుండా పోలీస్‌శాఖ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇప్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే భూ సర్వే

- రాష్ట్రంలో భద్రాద్రి జిల్లా మోడల్‌గా నిలవాలి
- నియోజకవర్గానికో గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌గా సర్వే
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా అవసరాలకోసం, భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మోడల్ ఉండాలన్నారు. శనివారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి మంత్రి ఐడీఓసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ సర్వే సాధ్యాసాధ్యాలపై ఆరా తీశారు. కొత్తగూడెం నియోజకవర్గ భూ వివరాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఒక్కో గ్రామంలో సర్వే చేపడతామన్నారు. ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ, అటవీ, పట్టా భూములు ఉండటంతో సమస్యలు వస్తున్నాయని, బైఫరికేషన్ చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో మంజూరైన లావొణి పట్టాలు, ప్రస్తుత రికార్డుల్లో ఉన్న భూమిని సరిచూస్తే బోగస్ పట్టాలను రద్దు చేయవచ్చన్నారు. భూ సర్వే ప్రక్రియకు ప్రత్యేక అధికారిని, సర్వేయర్లను నియమించుకుని, ఫిబ్రవరిలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కరిస్తే భూ ఆసాములకు భద్రత ఉంటుందన్నారు. తొలుత మంత్రికి కలెక్టర్ పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సర్వే, ల్యాండ్ ఏడీ శ్రీనివాసులు, ఆర్డీఓ మధు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సింగరేణి గెస్ట్‌హౌస్ సిబ్బందిపై ఆగ్రహం

కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి కొత్తగూడెంలోని సింగరేణి(ఇల్లెందు) గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. గెస్ట్‌హౌస్ నిర్వహణ సరిగ్గాలేదని, గదులు శుభ్రంగా లేకపోవటం, నిర్వహణలో లోపాలను గుర్తించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం గెస్ట్‌హౌస్ రికార్డులతో కల్లూరు మండలం నారాయణపురంలోని తన నివాసానికి వచ్చి కలవాలని ఆదేశించారు.

కనకగిరిపై పర్యాటకుల సందడి





గుట్టపైకి ఎక్కుతున్న పర్యాటకులు (ఇన్‌సెట్) వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి గుట్టలను హైదరాబాద్‌కు చెందిన పర్యాటకులు శనివారం సందర్శించారు. తొలుత వారికి బ్యాంబోక్లస్టర్ డైరెక్టర్లు, ఆదివా సీలు ఘనంగా స్వాగతం పలికారు. గుట్ట కింది భాగంలో ఉన్న హస్తాల వీరన్నస్వామి వారిని దర్శించుకున్నారు. భోగందానిగుళ్లు, ఆంజనేయుడు, నందీశ్వరుడిని దర్శించుకున్నారు. గుట్ట ఎక్కి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. గుట్ట పైభాగంలో ఉన్న వీరభద్రుడిని దర్శించుకుని పూజలు చేశారు. కాకతీయుల నాటి కట్టడాలను పరిశీలించారు. కోనేరులోని నీటిని ఆసక్తిగా తిలకించారు. పర్యాటక బృందం సభ్యులు కల్పన, అనురాధ, ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్, బ్యాంబోక్లస్టర్ డైరెక్టర్లు ఈసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనల ఉల్లంఘనపై కొరడా..

12 బస్సులకు జరిమానా



వాహనాల పత్రాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ భీమ్‌సింగ్

పాల్వంచరూరల్: రోడ్డు ట్రాన్స్‌పోర్టు నిబంధనలు ఉల్లంఘించి జాతీయ రహదారిపై తిరుగుతున్న అంతర్రాష్ట్ర బస్సులు, వాహనాలపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని నాగారంకాలనీ ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పాల్వంచ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) డి.భీమ్‌సింగ్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న 12 అంతర్రాష్ట్ర బస్సులు, ఇతర వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు ఎంవీఐ తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుల్ ఎస్.శివయ్య, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మవోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు చెక్కు అందిస్తున్న ఎస్పీ కిరణ్‌చవాన్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్ ఎదుట ఇద్దరు మహిళా మావోయిస్టులు సహా 9 మంది శనివారం లొంగిపోయారు. మావోయిస్టుల ఏరివేతకు ఒక వైపు సాయధ బలగాలు ఆపరేషన్ కగార్ పేరుతో అడవులను జల్లెడ పడుతుండగా, ఇంకోవైపు మావోయిస్టుల లొంగుబాటును ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రోత్సహిస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు దండకారణ్యంలో జరిగిన పలు ఘటనల్లో పాల్గొన్నారని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల మొత్తం రివార్డు రూ.43 లక్షలు ఉండగా వారికి అందించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు వారితో కలిసి భోజనం చేసి, వారికి నూతన వస్త్రాలు, స్వీట్లు అందించారు. ప్రభుత్వం తరఫున వారికి పునరావస పథకం కింద అందించాల్సిన అన్ని సహాయక చర్యలు తీసుకుంటామని ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు.

మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలోని కొల్లాపురంలో గత 47 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లుగానే ఈ సారి సైతం సంక్రాంతి పండుగకు మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి పోటీల్లో విజేతలకు రూ.20వేలు, రూ.16వేలు, రూ.12వేలు, రూ.8 వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ జట్ల వివరాలను ఈనెల 13వ తేదీలోగా 77023 47573, 77028 89013, 97016 36752 నంబర్లలో నమోదు చేసుకోవాలని నిర్వాహకులు ఆదినారాయణ, బుగ్గ వెంకటేశ్వర్లు, ఎర్రిపోతుల మల్లేష్, చీమల అభిషేక్, జార్జి, శశి, వినోద్, విజ్ఞేష్, రఘు, దిలీప్ కోరారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: అత్తను రాయితో కొట్టి గాయపరిచిన అల్లుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కుంట్ల పద్మ కుమార్తె లావణ్య భర్త సుడి నరేశ్‌తో పాల్వంచలోని నటరాజ్‌సెంటర్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 6న దంపతులు గొడవపడ్డారు. దీంతో లావణ్య పుట్టింటికి వచ్చింది. శనివారం అత్తగారింటికి వచ్చిన నరేశ్ భార్యతో గొడవ పడుతుండగా అడ్డుచెప్పబోయిన అత్త పద్మను రాయితో కొట్టడంతో ఆమె తలకు గాయమైంది. పద్మ ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎం.కృష్ణ తెలిపారు.

పొగాకు పంటపై గడ్డిమందు పిచికారీ

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: లక్షలాది రూపాయల పెట్టుబడితో సాగు చేస్తున్న పొగాకు పంటపై భూవివాదం నేపథ్యంలో గడ్డిమందు పిచికారీ చేయడంతో సాగుదారుడికి తీరని నష్టం వాటిల్లింది. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేయగా, శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మనెల్లి వెంకటేశ్‌కు అతడి తమ్ముడు నాగేశ్వరరావుకు మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. దీంతో తన అన్నయ్య సాగు చేస్తున్న పొగాకు పంటపై గడ్డిమందు పిచికారీ చేశారు. దీంతో దాదాపు ఐదు ఎకరాల్లో సాగులో ఉన్న పొగాకు మొక్కలు చనిపోయి, రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. బాధిత రైతు ఫిర్యాదుతో గడ్డిమందు పిచికారీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.20,506

స్కాన్ చేసి అభిప్రాయం చెప్పండి..

- పోలీసు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ స్కానర్ ద్వారా అవకాశం
- క్యూఆర్ కోడ్‌తో ప్రతీ ఠాణా పనితీరు స్కాన్
- పనితీరు ఆధారంగా పోలీసులకు ర్యాంకులు
- ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఐదు చోట్ల స్కానర్ల ఏర్పాటు



రామవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్ వద్ద ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: ప్రజల ఫిర్యాదులపై పోలీసుల స్పందన, ఆయా పోలీస్ స్టేషన్లవారీగా పోలీసుల పనితీరుపై ప్రజా స్పందన తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు ఏవిధంగా సమస్యలను పరిష్కరిస్తున్నారనే విషయాలను ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ ద్వారా తెలుసుకోనుంది. తద్వారా ఆయా పోలీస్ స్టేషన్లలోని పోలీసుల పనితీరుకు అనుగుణంగా ర్యాంకులను సైతం ఇవ్వనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న 28 పోలీస్ స్టేషన్లతో పాటు రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, ఐదు సబ్ డివిజన్ ఆఫీసులు, ఏడు సర్కిల్ కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అతికించారు. పోలీస్ స్టేషన్‌లోని ప్రధానగేట్, సందర్శకుల గది, ఎస్‌ఐ రూం, రైటర్ రూంలలో డిజిటల్ స్కానర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ డివిజన్ అధికారి కార్యాలయాల్లోనూ క్యూఆర్ కోడ్‌తో పోలీస్ శాఖ సాయంతో డిజిటల్ ఫీడ్ బ్యాక్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

2017లోనే..

రాష్ట్రంలో 2017 డిసెంబర్ 31వ తేదీన అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు సంబంధించిన సమాచారాన్ని ఇక్కడి నుంచి నిర్వహించారు. అనంతరం మూడేళ్ల సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్లు నడిచాయి. తరువాత ఈ విధానం మరుగున పడిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్లను తిరిగి ప్రారంభించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్‌తో..

ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఓపెన్ అవుతుంది. ఎఫ్ఐఆర్‌లు, ఈ–చలాన్లు, పాస్ పోర్టు వెరిఫికేషన్ వంటి సేవల్లో పోలీసుల పనితీరుపై ప్రజలు అభిప్రాయాన్ని తెలిపే అవకాశం ఉంది. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలను అధికారులు పట్టించుకోకపోయినా, నిర్లక్ష్యం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫీడ్ బ్యాక్ ఇచ్చే వీలుంటుంది. ఫిర్యాదులు, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఒక ఫాం వస్తుంది. దానిలో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఫోన్‌లో టైపింగ్ చేయడం రాకపోతే వాయిస్ మేసేజ్ ద్వారా వివరాలను తెలిపేందుకు అవకాశం ఉంది. అధికారులు, సిబ్బంది పనితీరు, ఆయా అధికారుల స్పందనను పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లొచ్చు.

మెసేజ్ లేదా వాయిస్ మెసేజ్



ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సిటిజన్ ఫీడ్ బ్యాక్ స్కానర్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. డీజీపీ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఏర్పాటు చేశాం. పోలీసులు ఫిర్యాదుదారులతో ఎలా ప్రవర్తిస్తున్నారు. కేసుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను ప్రజల నుంచి తెలుసుకుంటాం. కోడ్‌ను స్కాన్ చేస్తే మెసేజ్ లేదా వాయిస్ మెసేజ్ పంపే అవకాశముంటుంది.

– బి.రోహిత్‌రాజు ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం

ఢిల్లీ పరేడ్‌కు ఆహ్వానం

ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురికి అవకాశం




అజ్మీరా రాందాస్‌నాయక్, ఎం.మేఘన

గుండాల/నేలకొండపల్లి/కామేపల్లి: ఢిల్లీలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురికి ఆహ్వానం అందింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురికి ఎంపిక చేయగా జాబితాలో ఉమ్మడి ఖమ్మం వాసులు ఐదుగురికి స్థానం దక్కింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని బీసీ వసతిగృహంలో చదువుతున్న ఎం.మేఘనను చదువు, క్రీడల్లో ప్రతిభ కనబర్చినందుకు ఎంపిక చేసినట్లు తెలిసింది. ఆమెతో పాటు ఖమ్మం దోరెపల్లి సీతారామయ్యనగర్‌కు చెందిన ఇస్లావత్ మేఘనను పీఎం యశస్వి పథకం కింద ఎంపిక చేశారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాచనపల్లి పరిధి జగ్గుతండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ జర్పుల నీలిమ కూడా పరేడ్‌కు హాజరుకానున్నారు. ఇక పీఎం మత్స్య సంపద పథకం లబ్ధిదారుడైన కామేపల్లికి చెందిన అజ్మీరా రాందాస్‌నాయక్ సైతం పరేడ్‌కు ఎంపికయ్యారు. ఆయన కామేపల్లి పెద్ద చెరువు మత్స్యశాఖ సొసైటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అంతేకాక మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రస్తావించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన కూతురు సర్వి రాజశేఖర్, ఆయన కుమార్తె గాయత్రి సైతం రేడ్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్నారు. వీరంతా ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారు.

13న 'మంచుకొండ' ఎత్తిపోతలకు శంకుస్థాపన

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలానికి సాగునీటి సదుపాయం కల్పించేందుకు సాగర్ ప్రధాన కాల్వపై మంచుకొండ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ నిర్మాణానికి రూ.66 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా, లిఫ్ట్ ద్వారా మండలంలోని సుమారు 30పైగా చెరువులకు పైపులైన్ ద్వారా సాగర్ జలాలను తరలించనున్నారు. వచ్చే వ్యవసాయ సీజన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యాన పథకానికి సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు.

సభను జయప్రదం చేయండి

ఖమ్మంవన్‌టౌన్: రఘునాథపాలెం మండలం ముంచుకొండలో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఎత్తిపోతల పథకం శంకుస్థాపన సందర్భంగా నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం శంకుస్థాపనకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మేయర్ పి.నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారాతో పాటుబాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, యర్రం బాలగంగాధర తిలక్, కమర్తపు మురళి, మిక్కిలినేని నరేందర్, నాగండ్ల దీపక్ చౌదరి, లకావత్ సైదులు, వెంకటరమణ, రాపర్తి శరత్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న కార్పొరేషన్ చైర్మన్



పంచవటి కుటీరంలో అవినాష్‌రెడ్డి, తదితరులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామస్వామిని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అవినాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను నిర్వహించాక తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి, వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏలూరి కోటేశ్వరావు, నల్లపు దుర్గాప్రసాద్, వీరమాచినేని వినీల్, కనుబుద్ధి దేవా, తెల్లం హరికృష్ణ, దర్శి సాంబశివరావు, ఆకుల కృష్ణ, సిద్ధి ప్రవీణ్, కారం నవీన్, దర్శి వెంకయ్యచౌదరి, కాగితాల శివ, కొమరం గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెండు క్లినిక్‌లు సీజ్

చర్ల: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లను శనివారం వైద్య ఆరోగ్యశాఖాధికారులు సీజ్ చేశారు. మండంలోని తేగడలో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లలో స్థాయికి మించి వైద్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు అందింది. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నట్లు గుర్తించిన ఆయన ఈ రెండు క్లినిక్‌లను సీజ్ చేశారు. ఆయన వెంట సత్యనారాయణపురం వైద్యశాల వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

దమ్మపేట: లారీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలపల్లి గ్రామానికి చెందిన మట్టా లక్ష్మణ్‌రావు రోడ్డు పక్కన ఉన్న హోటల్ నుంచి బయటకు వచ్చే క్రమంలో సత్తుపల్లి వైపు నుంచి దమ్మపేట వెళ్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. అనంతరం లక్ష్మణ్‌రావు కాళ్ల పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని ఖమ్మం తరలించారు.

సెయింట్ మేరిస్‌లో అపూర్వ సమ్మేళనం



సరదాగా గడుపుతున్న నాటి విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సెయింట్ మేరిస్ పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2020 వరకు ఉన్న పదో తరగతి బ్యాచ్‌ల వారంతా కూడా పాఠశాల 75వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఒక్కచోట చేరి సందడి చేశారు. పదో తరగతి 20 బ్యాచ్‌ల వారంతా కూడా కలవడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఒక్కో బ్యాచ్ వారు ఒక్కో విధంగా సత్కరించారు. కుటుంబ, ఉద్యోగం, ఇళ్లు, కుటుంబ సభ్యుల వివరాలను చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భోజనం చేశారు.



పూర్వ ఉపాధ్యాయురాలితో విద్యార్థులు

18న నవోదయ ప్రవేశ పరీక్ష

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 18న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. నవోదయలో 80 సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించగా ములుగు జిల్లాలోని వెంకటాపురం సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,213మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉదయం 11–30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు విద్యార్థులు 10–30 గంటల్లోపు చేరుకోవాలని, ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణపత్రంతో పాటు ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నుతో రావాలని సూచించారు. కాగా, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నవోదయ వైబ్‌సైట్ నుండి అడ్మిట్ కార్డులు(హాల్‌టికెట్) డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

లారీ కింద పడి యువకుడి మృతి

పండుగకు సోదరిని తీసుకెళ్దామని వస్తుండగా ఘటన



లారీ కింద పడిన శ్రీనివాస్ (ఇన్‌సెట్) శ్రీనివాస్ మృతదేహం

ఖమ్మంక్రైం: సోదరిని పండుగకు తీసుకెళ్లడానికి వస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు లారీ కింద పడి మృతి చెందాడు. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. టేకులపల్లి మండలం బేతంపూడి వెంకటాయతండాకు చెందిన బోడా వాత్యా కుమారుడు శ్రీనివాస్(20) డిప్లొమా చదువుతున్నాడు. ఆయన సోదరి శ్రావ్య ఖమ్మంలో చదువుకుంటుండగా సంక్రాంతి సెలవుల్లో తీసుకెళ్దామని ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఈలోగా తన స్నేహితురాలు కలవడంతో ఆమెను బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ పక్కనుంచి వేగంగా పోనిచ్చాడు. ఈక్రమంలో లారీ శ్రీనివాస్ బైక్‌ను తాకడంతో అదుపు తప్పగా శ్రీనివాస్, ఆయన స్నేహితురాలు కిందపడ్డారు. ఆ సమయాన శ్రీనివాస్ లారీ చక్రాల కింద పడడంతో నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ఆయన స్నేహితురాలికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. తనను పండుగకు తీసుకెళ్తామని వచ్చిన సోదరుడు మృతి చెందిన సమాచారం తెలుసుకుని వచ్చిన శ్రావ్య, తల్లిదండ్రులు వాత్యా – భాగ్యలక్ష్మి గుండెలవిసేలా రోదించారు. కాగా, ఘటనాస్థలాన్ని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం .. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం చింతంపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నాగ నరసింహారావు (46) కొద్ది రోజుల కిందట అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి గొర్రెలను తోలుకొని వచ్చాడు. కాగా, సంక్రాంతి పండుగకు తన స్వగ్రామానికి వెళ్లేందుకు శుక్రవారం కాలినడకన బస్‌షెల్టర్ వద్దకు వెళ్తున్న క్రమంలో ఏలూరు జిల్లా వేలేరుపాడు వైపు నుంచి సాయిల సుబ్బారావు కారు అదుపుతప్పి నరసింహారావును ఢీకొట్టింది. క్షతగాత్రుడిని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య విజయతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిషన్ భగీరథ' పైపులో పాము



మిషన్ భగీరథ ఎయిర్‌వాల్‌లో వేలాడుతున్న పాము

అశ్వారావుపేటరూరల్: స్వచ్ఛమైన గోదావరి తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ ఎయిర్ వాల్‌లో పాము దూరిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని గాడ్రాల స్టేజీ వద్ద నందిపాడు, కుడుములపాడుతోపాటు పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు మధ్యాహ్నం నీరు వదిలారు. ఈ క్రమంలోనే గాడ్రాల స్టేజీ వద్ద ఉన్న మిషన్ భగీరథ పైపు నుంచి పాము చాలా వరకు బయటకు వచ్చి ఇరుక్కుపోయి చనిపోయింది. విషయం తెలిసిన ప్రజలు నీరు తాగితే ఏంజరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎయిర్ వాల్ పైపులో పాము వచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నెలలుగా ఈ ఎయిర్ వాల్ నుంచి లీకుల ద్వారా తాగునీరు వృథాగా పోతోందని, అయినా అధికారులకు పట్టడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై అశ్వారావుపేట మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ అభిషేక్‌ను వివరణ కోరగా.. పైపులో పాము ఉన్న సంగతి తన దృష్టికి రాలేదని, తక్షణమే సిబ్బందిని పంపించి బయటకు తీయిస్తామన్నారు. లీకేజీ కాకుండా మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ అరెస్ట్

కామేపల్లి: సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన కామేపల్లి మండలంలోని ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు... గోవింద్రాలకు చెందిన బోడా మంగ్యాజీనాయక్ ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన గతేడాది నుంచి ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాలకు చెందిన పలువురికి ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.లక్షల్లో వసూలు చేశాడు. ఆతర్వాత ముఖం చాటేయడంతో ఇటీవల సింగరేణి మండలానికి చెందిన భూక్యా హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగ్యాజీని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

క్షుద్ర పూజలు తూచ్..

ఇల్లు దక్కించుకునేందుకు పన్నాగం

ఇల్లెందు: ఓ వ్యక్తిని హతమార్చేందుకు కొత్తకాలనీ(ఆర్‌అండ్‌ఆర్)లో క్షుద్ర పూజలు జరిగినట్లు ప్రచారం గుప్పుమంది. రంగంలోకి దిగిన పోలీసులు, సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి.. అదంతా బోగస్ అని తేల్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భయభ్రాంతులు సృష్టించి, ఓ ఇంటిని అతి తక్కువ ధరకు కైవసం చేసుకోవాలని పన్నిన పన్నాగంగా వెల్లడించారు. కొత్తకాలనీని అడ్డాగా చేసుకుని సాగిస్తున్న అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలకకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీఐ హెచ్చరించారు. కాగా, ఓ నాయకుడు రంగంలోకి దిగి రాజీ చేయకపోతే నిందితుడు కటకటాల పాలయ్యేవాడని తెలిసింది.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



దగ్ధమైన కారు

బూర్గంపాడు: పాత పినపాక పట్టీనగర్‌కు సమీపంలో పొలాల వద్ద శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన మూల వెంకటరమణారెడ్డి తన కారు (ఏపీ20ఎ ఌ2255)ను శుక్రవారం రాత్రి పాత పినపాక పట్టీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వద్ద నిలిపి పొలానికి వెళ్లాడు. పొలంలో జేసీబీతో పనులు చేయిస్తుండగా కారు వద్ద మంటలు కనిపించగా అక్కడికి వెళ్లాడు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారు దగ్ధమైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాచినేనిపేటతండాలో చోరీ

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండాలోని మూడిళ్లలో పట్టపగలు చోరీ జరిగిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బాదావత్ రవి కథనం ప్రకారం.. మాచినేనిపేటతండాకు చెందిన మాలోత్ రాజ్యా, మాలోత్ సోమ్లా, మాలోత్ కరుణ గురువారం కూలీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. ఇళ్లలోని బీరువాల నుంచి రెండు తులాల బంగారం, సుమారు 53 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఓ బాధితుడు మాలోత్ సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి పేర్కొన్నారు.

దాడి చేసినవారిపై కేసు

ఇల్లెందు: మండలంలోని మసివాగు వీరాపురం కోటగడ్డకు చెందిన కల్తీ శ్రీరాములుపై అదే గ్రామానికి చెందిన సనప సాంబశివరావు, అనిల్, గొగ్గెల రాజేశ్ శుక్రవారం రాత్రి దారి కాచి దాడి చేశారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో శ్రీరాములు అల్లుడు సనప కృష్ణతో ముగ్గురు వ్యక్తులు ఘర్షణ పడుతుండగా శ్రీరాములు అడ్డుకున్నారు. దీంతో అదును చూసి దారి కాచి దాడి చేసి గాయపర్చారని శ్రీరాములు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ దాడి చేసినవారిపై కేసు నమోదు చేశారు.